రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండలంలోని కాలభైరవ స్వామి ఆలయానికి త్వరలో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఓఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో సి.సి.రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ కోపనాతి లలిత, సర్పంచ్ పెయ్యల మంగేష్, ఉపసర్పంచ్ కామాడి భైరవ మూర్తి, బర్రె కాటవేణి, కుడుపూడి శివ నారాయణ, దున్న జనార్ధ రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద పింఛనుదారులతో ఎంఎల్ఎ వనమాడి కొండబాబు

పెన్షన్లపై నిబంధనలు తొలగించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పెన్షన్ పథకానికి సంబంధించి పెట్టిన వింత నిబంధనలు వెంటనే ఉప సంహరించుకుని అర్హులందరికి పెన్షన్ ఇవ్వాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. వచ్చే ఏడాది నుంచి ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ రూ.2500 ను 250 పెంచి మొత్తం రూ.2750 ఇవ్వాల్సి ఉందని, దాని వల్ల ప్రభుత్వంపై భారం పడనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో పెన్షన్లను తప్పించేందుకు నిర్ణయం తీసుకుందని, 1000 చ.అ స్థలం ఉందని, కరెంటు బిల్లు 300 యూనిట్లు పైబడిందని, తదితర పలు కారణాలు చూపి పెన్షన్ తొలగించడానికి నోటీసులు అందించారని, పెన్షన్‌దారులకు జీవనోపాధి అయిన పెన్షన్ సొమ్మును దూరం చేయాలని కోవడం జగన్ రెడ్డికి సరైన విధానం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుమ్మల సునీత చేవేష్, సికోటి అప్పలకొండ, బంగారు సత్యనారాయణ, మూగు రాజు, ఎరుపల్లి రాము, చింతలపూడి రవి, కోడూరు కుమారస్వామి, అమలకంటి బలరాం, పొంగా బుజ్జి, పోలిపల్లి జగన్, నెల్లి రమణ, వానపల్లి పోలీస్, అరదాడి శివ, గొరును దుర్గారావు, గుమ్మళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆమ్ ఆద్‌మీ పార్టీ నాయకులు

.ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ వారు జిల్లా కన్వీనర్ నరాల శివ ఆధ్వర్యంలో స్థానిక ప్రజల నుండి ఈ సమస్య నివారణకు సంబంధిత అధికారులకు సుమారుగా ఒక వెయ్యి మంది స్థానిక ప్రజల సంతకాలు సేకరించి కాకినాడ జిల్లా కో కన్వీనర్ మేడి శెట్టి రామ్మోహన్, అచ్యుత రామ రాజులతో కలసి కాకినాడ కలెక్టర్ కృతిక శుక్లాకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ ఇంద్ర పాలెం నుండి గొల్లల మామిడాడ వైపు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల వల్ల ఇంద్రపాలెం చీడిగ గ్రామాల ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు వల్ల స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, రహదారి ఇరు వైపులా చిన్న వ్యాపారస్తులు, నివాసం వుంటున్న వారు, రాక పోకలు సాగించే వారు భారీ వాహనాలు వల్ల దుమ్ము ధూళి పొగ వల్ల ఇబందులు పడుతున్నారన్నాని సమస్యలపై వివరిం చారు. దీనిపై కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆమ్ ఆద్‌మీ పార్టీ నాయకులు

ఇంటింటికీ తాగునీరే లక్ష్యం...

ప్రజాశక్తి - గండేపల్లి

ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ ఇంటింటికి తాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి నిధులు కేటాయించి గ్రామంలోని మురుగునీటి తరలింపు చర్యలు తీసుకుంటున్నటు వసంత్ తెలిపారు. గ్రామ అభివద్ధిలో భాగంగా జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. గతంలో లేని విధంగా పనులను ప్రస్తుత ఉపసర్పంచ్ వసంత్ ఆధ్వర్యంలో జరుగుతున్నయని గ్రామ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. దళితువాడల అభివద్ధి కోసమే కాకుండా ఏ సమస్య వచ్చినా ఉన్నపలంగా వచ్చి వెంటనే స్పందించడం ఆయనకే చెల్లిందని గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఉప సర్పంచ్‌తో పాటు గ్రామ సర్పంచ్ కుక్కల ఆనంద్ గ్రామంలోని పలువురు పెద్దలు ఆయన వెంట ఉన్నారు.

పింఛనే ఆధారం

-15 రోజుల్లో అర్హత నిరూపించుకోకపోతే రద్దు - పలువురుకి నోటీసులు

-అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు - సాయం ఆపొద్దంటూ వేడుకోలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఈ ఫోటోలో కనిపిస్తున్న కాకినాడ 27వ డివిజన్ పైడా వారి వీధి ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఉద రేవతి, ఉద దేవీ మహేశ్వరి ఇరువురు చిన్నతనం నుంచి వికలాంగులు. తండ్రి శ్రీను లారీ డ్రైవర్ గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతి నెల మందులు, ఆసుపత్రి ఖర్చుల కోసం వీరికిస్తున్న పింఛను సొమ్ముతో పాటు, మరికొంత సొమ్ము అప్పులు చేయాల్సి వస్తుంది. అయితే కుటుంబ సభ్యులకు 1000 చదరపు అడుగుల కన్నా ఎక్కువ నివేశ స్థలం ఉందని, కావునా వారికి పింఛను నిలిపివేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు ఈనెల 21న నోటీసులు జారీ చేసారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమ బాధను చెప్పుకునేందుకు తల్లిదండ్రులు ఇద్దరు పిల్లల్ని ఎత్తుకొని సోమవారం కలెక్టరేట్ కు వచ్చారు. ఇలా ప్రభుత్వం అందజేస్తున్న పింఛను డబ్బులపైనే అనేకమంది ఆధారపడి జీవిస్తుండగా పలువురికి పింఛను నిలిపివేస్తున్నట్లుగా ఇటీవల నోటీసులు జారీ చేశారు. దాంతో సర్వత్రా ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి.

కాకినాడ జిల్లాలో అన్ని కేటగిరిల్లో సుమారు 2.68 లక్షల పింఛన్లు ప్రతినెల అందజేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి రూ.2,500 ఉన్న పింఛన్ సొమ్మును మరో 250కి పెంచి రూ.2750 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దింతో పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్న తరుణంలో ప్రభుత్వం వడబోతకు సిద్ధపడి జిల్లా వ్యాప్తంగా అనేకమంది లబ్ధిదారులకు ఈనెల 21న నోటీసులు జారీ చేసింది. అర్హతను రుజువు చేసుకోవాలని చెబుతోంది.దింతో పలువురు అర్హత ఉన్నా పేదల్లో టెన్షన్ మొదలైంది. ఒక్కో సచివాలయం పరిధిలో 6 నుంచి 40 మంది వరకు నోటీసులు జారీ చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 620 గ్రామ, వార్డు సచివాలయాలుండగా 10 వేల మందికి పైగా నోటీసులు అందుకున్నట్లు సమాచారం. కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో 50 డివిజన్లు ఉండగా ఒక్కో డివిజన్లో 20 నుంచి 40 పెన్షన్లకు మొత్తంగా 2వేలకు పైగా పింఛన్లకు కోత విధించినట్లుగా సమాచారం. వచ్చేనెల వీరందరికి పింఛన్ అందే పరిస్థితి కనిపించడం లేదు.

ఇవీ కారణాలు ..

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల్లో ఒకరికి 1000 చదరపు అడుగుల నివేశ స్థలం ఉందని, విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటిందని, 10 ఎకరాలు పైబడి భూమి, నాలుగు చక్రాల వాహనం ఉందని తదితర కారణాలతో నోటీసులు ఇచ్చారు. వాటిని అందుకున్న 15 రోజుల్లో అర్హతపై ఆయా సచివాలయాల్లో రాత పూర్వక వివరణ, ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. అనేకమంది లబ్ధిదారులకు కారు లేకయినా, 300 యూనిట్ల విద్యుత్ వాడకం, నివేశ స్థలాలాలు లేకపోయినా టెక్నికల్ పొరపాట్లు వలన సమస్యలు వస్తున్నాయి. దీంతో అర్హత ఉన్నా లబ్ధిదారులకు పింఛన్లు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

పుట్టుకతో వికలాంగులైన ఇద్దరు పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చిన తల్లిదండ్రులు

ముగ్గురికీ పింఛన్లు నిలిపివేశారు

మా కుమార్తె దుర్గాభవాని, కుమారుడు జయ సాయికృష్ణ పుట్టుకతో విక లాంగులు అయినందున 20 ఏళ్లుగా వారికి పింఛన్ ఇస్తున్నారు. నాకు భర్త లేనందున వితంతు పింఛను అందుతోంది.1000 చ.అడుగుల్లో ఇల్లు ఉందనే కారణంతో నోటీసులు ఇచ్చి పింఛన్లు నిలిపివేశారు. స్పందనలో ఫిర్యాదు చేసాం. ప్రభుత్వం ఇస్తున్న సాయంపై ఆధారపడిన మమ్మల్ని ఆదుకోవాలి.

- గురజాపు శంకర కుమారి, 20వ డివిజన్, కాకినాడ

పింఛను నిలిపివేయడం అన్యాయం

మా కుటుంబంలో మూడు విద్యుత్ మీటర్లు ఉన్నాయనే కారణంతో 30 ఏళ్లగా తీసుకుంటున్న పింఛను నిలిపివేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. వాస్తవానికి నా పేరును ఎటువంటి విద్యుత్ మీటర్లు లేవు. అధికారుల చుట్టూ తిరుగు తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పింఛన్ ను పునరుద్ధరించాలి.

- ఆడారి పద్మావతి, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద, కాకినాడ

పటిష్టంగా పిసిపిఎన్‌డిటి చట్టం అమలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పిసి, పిఎన్‌డిటి) చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశంలో చట్టం అమలు తీరుపై చర్చించారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆప రేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితరాలకు సంబంధించిన వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో 337 ఆకస్మిక తనిఖీలు, 61 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమ న్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవా లన్నారు. తనిఖీలు అధికంగా చేపట్టాలని ఆదేశించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని స్పష్టం చేశారు. కొత్తగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు, రెన్యువల్, చిరునామా, మెషీన్ మార్పులు, క్లోజర్ అనుమతులకు సంబంధించిన 16 దరఖాస్తులకు సమావేశం ఆమోదం తెలిపింది. పీసీ, పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన పెంపొందించే పోస్టర్లను ముఖ్య ప్రాంతాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ చట్టం, 2021 పరిధిలో మూడు లెవెల్-2 ఏఆర్‌టీ క్లినిక్‌ల ఏర్పాటుకు సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను ఆమోదించరు. ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌వో పీవీ శ్రీనివాస్, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.రమేష్, అడిషనల్ ఎస్‌పి పి.శ్రీని వాస్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పీబీ విష్ణువర్ధిని, డిఐఒ డాక్టర్ అంజిబాబు, డెమో సీహెచ్ ఎస్‌వీడీవీ ప్రసాదరాజు పాల్గొన్నారు.

వీధి సుబ్రహ్మణ్యం తల్లి అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా

కలెక్టర్ స్పందనకు 318 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టరు ప్రఖర్ జైన్, డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, సీపీవో పి. త్రినాథ్‌లతో కలిసి ప్రజల నుంచి 318 అర్జీలు స్వీకరించారు. స్పందనకు వచ్చే ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి నాణ్య మైన, సంతప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టం కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. పరిష్కార నివేదికకు అర్జీ దారి సమస్య పరిష్కారానికి సంబం ధించిన ఫోటోలను తప్పనిసరిగా జత చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ కలిసిన సుబ్రహ్మణ్యం తల్లి

కాకినాడ కలెక్టరేట్లో స్పందన కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్‌తో కలిసి, వీధి సుబ్రహ్మణ్యం తల్లి వీధి నూకరత్నం కలెక్టర్‌ను కలిశారు. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వృద్ధులని, చిన్న కొడుకు వీధి నవీన్‌కి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం ప్రకారంగా మృతుని కుటుంబ సభ్యులకు రెండున్నర ఎకరాలు భూమి ఇవ్వవలసి ఉందని దాని ఇప్పించే ఏర్పాటు చేయమని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల్లో భూమిని ఇస్తామని, రెండు మూడు రోజుల్లో నవీన్‌కి ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పోలీస్ స్పందనకు 54 అర్జీలు

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ స్పందన ఎస్‌పి ఎం రవీంద్రనాథ్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన అర్జీదారుల నుంచి వినతుల స్వీకరించి, సంబంధిత పోలీస్ అధికారులకు వాటిని అందజేశారు. స్పందనకు 54 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ స్పందనకు వచ్చే ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమం అనంతరం అరె జీవరాలకు ఉచిత భోజన వసతి సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి శ్రీనివాస్, ఎస్‌బి డిఎస్‌పి అంబికా ప్రసాద్, కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయం వద్ద అర్జీదారులకు భోజనం అందజేస్తున్న సిబ్బంది

వికలాంగుల సమావేశంలో మాట్లాడుతున్న సుంకర శివప్రసన్న

వికలాంగులను రాజకీయ సమిధులుగా చేయడం తగదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు వికలాంగులను రాజకీయ సమిధులను చేస్తున్నారని అంటూ ఆయన వైఖరిపై కాకినాడ సిటీ వైసిపి అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం కాకినాడ వైసిపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో పెన్షన్ అందడంలో ఆలస్యమైతే దానిని సాకుగా తీసుకుని టిడిపి నేతలు రాజకీయం చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ క్రమం తప్పకుండా లబ్ధిదారుల ఇంటికెళ్లి పెన్షన్ అందిస్తోందన్నారు. కాకినాడ నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్ర శేఖరరెడ్డి చిత్త శుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. అంతే గానీ టెక్నికల్ ప్రాబ్లం కారణంగా పెన్షన్ తీసుకోవడం ఆలస్యం అయిన వాళ్ల ఇంటి కెళ్లి పెన్షన్ ఇప్పిస్తానని నమ్మించి వాళ్లను కలెక్టర్ కార్యాలయానికి తీసు కెళ్లి డ్రామాలు వేయడం పద్ధతి కాదన్నారు. స్పందన కార్యక్రమం ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రూపొందించింది మాజీ ఎంఎల్ఎ వనమాడి గ్రహించాలని సిటీ సుంకర శివ ప్రసన్న ఎద్దేవా చేశారు.

విజేతలను అభినందిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు

క్రీడలు మానసిక చైతన్యానికి దోహదం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విధి నిర్వహణలో పని ఒత్తిడితో ఉండే పోలీసులకు క్రీడలు మానసిక చైతన్యా నికి ఎంతో దోహదం చేస్తాయని, ప్రతిరోజు ఒక గంట సేపైనా తమకు నచ్చిన క్రీడల్లో పోలీసులు పాల్గొనాలని ఎస్‌పి ఎం రవీంద్రనాథ్ బాబు అన్నారు. ఈ నెల 25న కాకినాడ టౌన్ హాల్‌లో నిర్వహించిన టెన్నిస్ చాంపియన్షిప్ డబుల్స్(45 ప్లస్ విభాగం)లో కాకినాడ పోలీస్ స్టేషన్ సభ్యులైన అడిషనల్ ఎస్‌పి (రిజర్వు), ఆర్ఐ అడ్మిన్ శ్రీహరి రావు, ఫైనల్స్‌లో మొదటి స్థానంలో నిలిచి బహుమతుల సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్‌పి రవీంద్రనాథ్ మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో ఉండే పనిచేస్తూ కూడా క్రీడల పై మక్కువతో విజయం సాధించారని వారిద్దరినీ అభినందించారు. మరిన్ని క్రీడా విభాగాల్లో పోలీసులు అంతా పాల్గొనాలని ఎస్పీ సూచించారు. ఆయనతోపాటు అడిషనల్ ఎస్‌పి శ్రీనివాస్ ఉన్నారు.

. మత్స్యకార గ్రామాల్లోని దళితులకు పరిహారం అందిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

దళితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒఎన్‌జిసి నష్టపరిహారంలో భాగంగా దళిత గ్రామాల ప్రజలకు పరిహారంలో కొంతనగదు అందిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధిలో ఓఎన్‌జిసి పరిహారం శాంక్షన్ లిస్ట్‌లో ఉన్న దళితులకు కొందరు వ్యక్తుల ఫిర్యాదుల వలన పరిహారం రాలేదని తెలిపారు. అటువంటి వారికి గాడిమొగ పంచాయతీ పరిధిలోని పెదగాడి మొగ, పెదవలసల, లక్ష్మీపతిపురం, చిన్న వలసల గ్రామాల మత్స్యకారులకు వచ్చిన మొత్తంలో కొంత నగదు పంచాయతీ పరిధిలోని దళితులకు గ్రామ ప్రజలు ఇచ్చిన ఆ మొత్తాన్ని గాడిమొగ పంచాయతీ పరిధిలో ఉన్న 219 మంది దళితులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఎంఎల్ఎ సతీష్ కుమార్ సుమారు రూ.22 లక్షలు నగదు సోమవారం పంచాయతీ వద్ద పంపిణీ చేశారు. గాడిమొగ ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, అంకాడి అంజిబాబు, పోతా బత్తుల నూక రాజు, ఎంపీటీసీలు రేఖాడి నరసింహమూర్తి చెక్క కామేశ్వరరావు, అన్నవరం, మాజీ సర్పంచ్ లంకె రాముడు, వినకోటి రామకష్ణ, పులుపకూర అప్పారావు, కావూరి సత్యనారాయణ, 4 గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



జగ్గంపేటలో నవీన్ పాదయాత్రకు స్వాగతం చెబుతున్న మహిళలు

కొనసాగుతున్న నవీన్ పాదయాత్ర

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న పాదయాత్రలో భాగంగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ జగ్గంపేటలోని సోమవారం తన పాదయాత్రను కొనసాగించారు. ప్రజలకు పథకాలు సరిగా అందడం లేదని నవరత్నాలు నిరుప యోగంగా ఉన్నాయని ఆయన విమర్శించారు.ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాజీ ఎంపీపీ మారిశెట్టి భద్రం, జగ్గంపేట టౌన్ ప్రెసిడెంట్ రాంబాబు, జీనుమణి బాబు, గోవిందపురం సర్పంచ్ కమ్మలు వెంకటేశ్వర్లు, కమ్మల దుర్గయ్య, వెలిశెట్టి శ్రీను వెలిశెట్టి బుజ్జిలు, గారపాటి బాబి, సాయి, డోకల శివ, తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -కరప

నడకుదురులో కరప మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ మేడపాటి రాజకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ స్పర్జన్ బాబు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, నడకుదురు గ్రామ సర్పంచ్ డేగల లాలితకుమారి, ఎంపిటిసిలు పైల రామతులసి గోవిందు, వేళంగి గ్రామ సర్పంచ్ సవిలే నీలిమారాజేష్, రెడ్డిపల్లి వర రమేష్, గొడ్డటిపాలెం గ్రామ సర్పంచ్ వాశంశెట్టి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పబ్బినీడి చక్రరావు, పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలం పులిమేరు శాంతివర్ధన వికలాంగుల పాఠశాలలో సోమవారం శాంతి వర్ధనం మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రాయవరపు వీరబాబు, సత్య దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు పాల్గొన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన క్రిష్టోఫోర్ క్రిస్మస్ సందేశం అందించారు. సిజేఎం వ్యవస్థాపకులు నంగిన సామ్యూల్ సుదీప్, దవులూరి సుబ్బారావు, నంగిన ఆనందకుమార్, అభిషేక్, జయ కుమార్, ఆనందకుమార్, జేమ్స్, సునీల్, సుజాత, కంటే వీరరాఘవరావు, గోపు మురళి పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్ఎ కన్నబాబు

ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రబీ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభించారని, రైతులు సకాలంలో తమ పంటల సాగు వివరాలను ఇ-పంట నమోదు చేయించుకోవాలని కాకినాడ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జివి పద్మశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం సామర్లకోట మండల వ్యవసాయాధి కార్యాలయంలో ఎఒ ఇమ్మిడిశెట్టి అధ్యక్షతన మండల పరిధిలో ఆర్‌బికేల్లో పనిచేస్తున్న విఎఎలకు సమీక్షా సమావేశంను నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎడిఎ జివి పద్మశ్రీ మాట్లాడుతూ ప్రతీ రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా, డిఎపి ఎరువులు అందుబాటులోవున్నాయన్నారు. ఎంటియు- 1121 వరి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని 30 కిలోల బస్తా రూ.150 సబ్సిడి పోనూ, రైతు రూ.992 చెల్లించి పొందాలని సూచించారు. ఆర్‌బికేల్లో రైతులతో రైతు భరోసా నెలవారీ మాస పత్రికలను చందా దారులుగా చేర్పించాలని, విఎఎలు రైతులకు అందుబాటులో ఉండి వ్యవ సాయ సలహాలు సూచనలు ఎప్పటికపుడు తెలియజేయాలని ఆదేశించారు.

క్లోజింగ్ సర్టిపికేట్‌లను దాఖలు చేయాలి

ధాన్యం కొనుగోలు మండల ప్రత్యేకాధికారి వాసంతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తైనందున ఆయా గ్రామాల నుండి వివరాలు తీసుకున్నారు. అలాగే ధాన్యం కొనుగోళ్ల పూర్తికాగానే ఆయా ఆర్‌బికేల నుండి విధిగా క్లోజింగ్ సర్టిపికేట్‌లను పంపించాలని సూచించారు. సమావేశంలో ఎఒ ఇమ్మిడిశెట్టి సత్య, ఎఇఒలు ఎంవి సతీష్, శాంతి కమల, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

జర్నలిజం విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - కాకినాడ

జర్నలిజం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాలలోఉద్యోగావకాశాలు లభిస్తున్నా యని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన డిగ్రీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లో భాగంగా రేడియో అల 90.8 ఎఫ్.ఎం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న పిఠాపురం రాజాస్ ప్రభుత్వ కళాశాల జర్న లిజం విద్యార్థులు సోమవారం కలెక్టర్ కార్యాలయ పనితీరును అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సోషల్ మీడియా విస్తరిస్తున్నందున జర్నలిజం విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు కొదవలేద న్నారు. జర్నలిజం విద్యార్థులు నైతిక విలువలతో కూడిన పనితీరును కనపరచి మంచి పేరు ప్రఖ్యాతలు గడించాలని సూచించారు. కార్యక్రమంలో రేడియో అల 90.8 ఎఫ్.ఎం స్టేషన్ డైరెక్టర్ ఎం.సత్య, యునైటెడ్ న్యూస్ నెట్‌వర్క్ డైరెక్టర్ జి.ఖ్యాతీశ్వరి పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ దొరబాబు

తరగతి గదుల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

వాకతిప్ప హై స్కూల్లో నిర్మిస్తున్న అదనపు తరగతుల గదుల నిర్మాణాన్ని సోమవారం పిఠాపురం ఎంఎల్ఎ పెండం దొరబాబు, రాష్ట్ర వైఎస్సార్సీ నాయకులు రావు చిన్నారావు పరిశీలించారు. సోమవారం గడప గడప కార్యక్రమంలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడులో భాగంగా ఫేజ్-టు లో వాకతిప్ప ఉన్నత పాఠశాలలో 15 తరగతి గదులు సుమారు రూ.16.5 లక్షలతో అదనపు గదులు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, లొల్ల సత్యనారాయణ, పాలాని దొరబాబు, కర్రీ చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ చంద్రశేఖరరెడ్డి

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్థానిక గాంధీ నగర్ లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి టాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏడిసి నాగ నరసింహారావు కార్యక్రమానికి హాజర య్యారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్ కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, ఇనుకొండ పట్టాభి రామయ్య డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ వాణి కుమారి పాల్గొన్నారు

క్రీడాకారులతో విసి ప్రసాద్ రాజు, రిజిస్ట్రార్ సుమలత, విభాగాధిపతులు

క్రీడాకారులకు విసి అభినందన

ప్రజాశక్తి - కాకినాడ

రూర్కెలా స్టీల్ ప్లాంట్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు నిర్వహించిన 2వ అజిత్ రాయ్ మెమోరియల్ ఆలిండియా ఇన్విటేషన్ టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రన్నర్స్‌గా నిలిచిన జెఎన్టియుకె బ్యాస్కట్ బాల్ టీమ్ క్రీడాకారులను ఉపకులపతి జివిఆర్. ప్రసాదరాజు సోమవారం తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్లో భాగంగా 10 టీమ్లలో జెఎన్‌టియుకె టీమ్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి తమ ప్రత్యర్థిపై 9 పాయింట్ల తేడాతో రన్నర్స్ గా నిలిచినట్లు యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ జి.శ్యామ్ కుమార్ తెలిపారు. జెఎన్టియుకె తరపున ఇదే టీమ్ దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడలలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. టీమ్‌కు కోచ్ గా వ్యవహరించిన వి.ఆర్. రుద్ర, క్రీడాకారులను ఉపకులపతి ప్రసాదరాజుకి పరిచ యం చేశారు. క్రీడాకారులను అభినందించిన వారిలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, రిజిస్ట్రార్ ఎల్. సుమలత, డైరెక్టర్ అడ్మిషన్స్ డా.కె. పద్మరాజు తదితరులు వున్నారు.

కోడిపందేల ఆడొద్దంటూ ప్రచారం ప్రారంభించిన తుని సిఐ నాగదుర్గారావు

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు

సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు గుండాట అసాంఘిక కార్యక్ర మాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తుని పట్టణ సీఐ ఎం. నాగ దుర్గారావు. సోమవారం తుని పట్టణంలో 30 వార్డుల్లోనూ ఆటోలు ద్వారా మైక్‌లో ప్రచారం నిర్వహించారు. తుని పట్టణంలో అనుమాని తులుగా ఎవరైనా కనిపించిన తమకు సమాచారం ఇవ్వాలని సంక్రాంతి పండుగ సందర్భంగా ఇల్లు వదిలి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా మీ మీ ఇంటికి భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో కోడి కత్తులు కలవారిని, పాత పందెం రాయుళ్లపై బైండోవర్ కేసులు త్వరలోనే నమోదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు గోపాలకృష్ణ, సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండు గీయాలంటే రూ.50 ఇవ్వాల్సిందే

రత్నగిరిపై డయల్ యువర్ ఇఒకు ఫిర్యాదులు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం కొండపైకి వచ్చే యాత్రికులు మొక్కులు తీర్చుకు నేందుకు గుండు గీయించు కోవాలంటే గుండుకు రూ.50 రూపాయలు ఇవ్వాల్సిందేనని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారని రాజమండ్రి చెందిన వెంకట్రావు అనే భక్తుడు ఫిర్యాదు చేశారు. సోమవారం కొండపైన ఇన్చార్జి ఇఒ ఎసిరమేష్ బాబు నిర్వహించిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో కేశఖండనశాల నిర్వాహకుల ప్రవర్తిస్తున్న తీరుపై మరికొంతమంది ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఆలయాల్లో హారతిపళ్లాల్లో డబ్బులు వేస్తే గాని గోత్ర నామాలు చదవడం లేదని, దేవస్థానం గోశాలలో కూడా ముందు తమ పళ్లాల్లో డబ్బులు వేసిన తర్వాతే ప్రదక్షిణలు చేయాలని అక్కడ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారని కొండపైకి రావాలంటే భయ మేస్తుందని విశాఖపట్నం చెందిన సంతోష్‌కుమార్ పిర్యాదు చేశారు అలాగే స్వామివారు గర్భగుడిలోకి తీసుకెళ్తానని తాను దేవస్థానం ఉద్యోగినంటూ తమ నలుగురికి రూ1000 తీసుకుని, టికెట్లు ఇవ్వకుండా గర్భగుడిలోకి పంపించారని, కేశఖండన శాలలో తమ మొక్కలు తీర్చుకోవాలంటే అక్కడ నిర్వాహకులు పెద్దలకు రూ.70 పిల్లలకు రూ.30 రేట్లు పెట్టి తీసుకుంటు న్నారని ఇవ్వకపోతే గుండుపై గాట్లు కూడా పెడుతున్నారని కొత్తపల్లికి చెందిన రామారావు ఫిర్యాదు చేశారు. గిరిజన ప్రాంతాల్లో దేవస్థానం తరపున కళ్యాణ మండపం నిర్మించాలని అడ్డతీగల చెందిన పవన్‌గిరి స్వామీజీ కోరారు. బైపాస్ లో ఉన్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద టెంకాయ కొట్టే ప్రదేశంలో అపరిశుభ్రత వాతావరణం ఉందని రాజమండ్రి చెందిన జి.శాస్త్రి ఫిర్యాదు చేశారు. కొండ దిగువన శిథిలావస్థలో ఇఒ క్వార్టర్స్, అనంతలక్ష్మి సత్రం పడగొట్టి అక్కడ దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికుడు ఈర్లు శ్రీనువాసరావు ఇఒ కి సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఎఇఒలు జగ్గుబాబు, భ్రమరాంబ ఇంజనీరింగ్ అధికారులు పి.గుర్రాజు, పి.ఆర్.ఒ డి కృష్ణారావు పాల్గొన్నారు.

కొండపైన డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నిర్వహించిన ఎసి రమేష్ బాబు

సమన్వయంతో అట్రాసిటీ కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ డివిజన్ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడటంతో పాటు కేసుల పరిష్కారానికి రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కాకినాడ ఆర్‌డిఒ బివి రమణ కోరారు. సోమవారం కాకినాడ ఆర్‌డిఒ బివి రమణ అధ్యక్షతన డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణా రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి అప్పారావుతో పాటు జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దోకుబుర్ర భద్రం, డాక్టర్ మోకా పవన్‌కుమార్, బండి వీరలింగేశ్వర రావు, పిల్లి జ్యోతి, డివిజన్ స్థాయి కమిటీ సభ్యులు, వివిధ మండలాల తహశీల్దార్లు హాజరయ్యారు. తొలుత కాకినాడ డివిజన్‌లో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసులు, వాటి పురోగతి, బాధితులకు సహాయం పంపిణీ, ఉపాధి కల్పన, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఆర్‌డీఒ బీవీ రమణ మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏర్పడిన తర్వాత తొలి సారిగా కమిటీ నూతన సభ్యులతో డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ (ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్) సమావేశం నిర్వహించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అట్రాసిటీస్ కేసులకు సంబంధించి పెండింగ్‌లో కేసులను పరిశీ లించి అర్హులైన బాధితులకు సహాయం అందజేస్తామన్నారు. డివిజన్ పరిధిలో మండల రెవెన్యూ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం లేకుండా ఆయా మండల తహశీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెల 30వ తేదీన మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే సమావేశం సక్రమంగా నిర్వహిం చేందుకు కృషిచేయాలన్నారు.

మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమణ

ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్‌పి బి.అప్పారావు మాట్లాడుతూ అట్రాసిటీస్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్, ఛార్జ్ షీట్ కాపీలను ఆర్‌డిఒ కార్యాలయానికి, ఆయా తహశీల్దార్ల కార్యాలయాలకు వెంటనే పంపిస్తున్నా మన్నారు. బాధితులకు వెంటనే ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించే విధంగా మండలస్థాయిలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తామన్నారు. కాకినాడ డీఎస్‌పీ కె.మురళీకృష్ణా రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డివిజన్ స్థాయి కమిటీ సభ్యులు సాపె సుధాకర్, మశిగిరి రాంబాబు, బొనగిరి బలభద్రరావు, సిద్దమటపు రాజు పాటు ఎన్‌జీవో సంస్థల నుంచి ఎస్.పి.రెడ్డి, ఎన్.సుధాంజలి హాజరయ్యారు. సమావేశంలో కాకినాడ రూరల్, కరప, పెదపూడి, పిఠాపురం, కాజులూరు, సామర్లకోట, తాళ్లరేవు, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండల తహశీల్దార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

28న వాహనాలకు వేలం

ప్రజాశక్తి - కాజులూరు

తాళ్లరేవు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్రాంచ్ పరిధిలో ఈ నెల 28 న సీజ్ చేసిన వాహనాలను వేలం నిర్వహిస్తున్నట్లు సిఐ జె. వెంకట భవాని సోమవారం తెలిపారు. సారా రవాణా, పన్ను చెల్లించని మద్యం బాటిళ్ల అక్రమ రవా ణాలో ఉపయోగించిన 24 మోటారు వాహనాలను ఈ నెల 28 బుధవారం కాకినాడ అసిస్టెంట్ రిజర్వు పేరెడ్ గ్రౌండ్లో ఉదయం పది గంటలకు జరుగనున్న వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డుతో వచ్చి, ధరావతు సొమ్ము చెల్లించిన అనంతరం వేలంపాటలో పాల్గొన వచ్చన్నారు. వాహనం దక్కించున్నవారు 18 శాతం జిఎస్‌టి చెల్లించాలన్నారు.

సుంకవల్లి కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

పుత్రవియోగంతో బాధ పడుతున్న సుంకవల్లి రాంబాబు కుటుంబాన్ని పలువురు ప్రజా ప్రతి నిధులు పరామర్శించారు. గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెం దిన సుంకవల్లి రాంబాబు కుమారుడు సాయి (11) మూడు రోజులుగా అనా రోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించడంతో సోమవారం మతి చెందాడు. పుత్ర శోకంతో ఉన్న రాంబాబు కుటుంబాన్ని ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు

సాయి ఫైల్ ఫోటో

31న పెద్దాపురంలో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - పెద్దాపురం

యువ చైతన్య సేవా సమితి, కాకినాడ నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, తూర్పుగోదావరి క్రీడ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దాపురంలో ఈనెల 31వ తేదీ న బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని నిర్వా హకులు తెలిపారు. బాలురకు వాలీబాల్, బాలికలకు కోకో, బాల బాలిక లకు 200 మీటర్ల పరుగులు పందెం, షార్ట్ పుట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండిన యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు న్నారు. పోటీల్లో పాల్గొనే యువత ఈ నెల 27, 28 తేదీలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.ఎంట్రీ ఫీజు లేదని, వివరాలకు 9030946444 నెంబర్ను సంప్రదించవచ్చన్నారు.

స్పందనలో అర్జీలు పరిశీలిస్తున్న ఎడిసి నాగనరసింహారావు

కార్పొరేషన్ లో స్పందన

ప్రజాశక్తి -కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్ర మాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛన్లు, టౌన్ ప్లానింగ్ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అంద జేశారు. ప్రజల నుంచి వచ్చిన ఆయా విజ్ఞప్తులను అక్కడే ఉన్న అధికారుల ద్వారా సత్వర పరిష్కారానికి ఏడిసి నాగ నరసింహారావు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ స్థానికంగా ఉండే సచివా లయాల్లో కూడా వినతులు అందించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు సిబ్బంది ఉన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

సిపిఐ ఏర్పడి 98 సంవత్సరాలు అయిన సందర్భంగా కొత్త పల్లి, సెంటర్‌లో సిపిఐ జెండాను సీపీఐ పిఠాపురం మండల కార్యదర్శి సాక రామకష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి జి. లోవకుమారి, ఉలవల ఓమ్ నమాశివయా. రావురంగబాబు. కాము శంకరరావు. పిచ్చుక నాగేశ్వరరావు.చెరుకూరు గణపతి. గుబ్బల లెనిన్ బాబు. మీసాల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ప్యూరిఫైర్‌ను ప్రారంభిస్తున్న సత్యవతి

వాటర్ ప్యూరిఫైర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్యూరిఫైర్‌ను చైర్పర్సన్ అలమండ సత్యవతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికే కాకుండా కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన మంచినీరు అందించే ఏర్పాటు చేసిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్లు శిడగం త్రివేణి, మా సారపు బుజ్జి, కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందబాబు, మూది నారాయణస్వామి, బొద్దిరెడ్డి గోపి, కోణాల వెంకటరమణ, వాగు బలరాం, కమిషనర్ కే శ్రీనివాస్, మెప్మా సిబ్బంది ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కరప

గురజనాపల్లి హై స్కూల్ విద్యార్థులకు సోమవారం ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాస్ సుమారు రూ.3000 విలువ చేసే వాలీబాల్స్, షటిల్ బ్యాట్స్, బాల్స్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బిఆర్ ప్రసాద్ రావు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగ లింగేశ్వరరావు, వివి రమణమూర్తి, సూర్యనారాయణ, జి.అర్జునరావు పాల్గొన్నారు.

పూరి గుడిసెకు చేరుకున్న గోగులమ్మ

ఉంద్రాజవరం : తాడిపర్రు గ్రామ దేవత గోగులమ్మ జాతర మహోత్సవంలో భాగంగా గోగులమ్మ తల్లిని సోమవారం గ్రామ నడివీధిలోని పూరిగుడిసెకు తీసుకొచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేథ్యాలు సమర్పించారు. గ్రామ ఆడపడుచులు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం కిటకిటలాడింది. జనవరి 17,18 తేదీల్లో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేసినట్లు కమిటీ తెలిపింది.

ట్యాబ్ అందుకుంటున్న విద్యార్థి, తల్లి

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

విద్యార్థులు సౌకర్యాలు అందిపుచ్చుకుని శ్రద్ధగా చదువుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యా ప్రదాత వేగుళ్ల చైతన్యబాబు అన్నారు. స్థానిక ఏడిద రోడ్డు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్ ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దాతలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం 49 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు టాబ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోరుకొండ సత్య ఏసుమని, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్ సీనియర్ ఉపాధ్యాయులు శ్రీహరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేస్తున్న వికలాంగులు తదితరులు

అనాథకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - అమలాపురం

అనాథ వికలాంగుని సోమవారం పలువురు అంతిమ సంస్కా రాలు నిర్వహించారు. వివరాలు ఇవి.. ఆయన ఒక అనాథ. వికలాంగుడు కావడంతో ట్రై సైకిల్లో తిరుగుతూ రాత్రి వేళల్లో రోడ్డు పక్కన విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆ బండిలోనే తుది శ్వాస విడిచారు. ఆయనకు ఎవరూ లేరు. రోడ్డుపైన బిక్షాటన చేసుకుంటూ ఎవరైనా పెట్టిన ఆహారం తింటూ సాయంత్రానికి రోడ్డు పక్కనే విశ్రాంతి తీసుకుంటూ జీవనం సాగించే వికలాంగుని మరణం పట్ల సాటి వికలాంగులు స్పందించి అంతిమ సంస్కారాలకు పూనుకున్నారు. వీరికి కోనసీమ వికలాంగ సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఒంటెద్దు వెంకన్న నాయుడు తోడవగా స్థానిక కౌన్సిలర్లు యండమూరి గంగ శ్రీను, గోపి రాజీ రమేశ్, బండారుగోవిందు, స్థానిక నాయకులు మోరం రవిప్రసాద్ అంతిమ సంస్కా రానికి కావాల్సిన సహకారాలు అందించారు. అమలాపురం మున్సిపల్ కాలనీలో నివాసం వుండే వికలాంగుడు పితాని జగపతిరావు ఇటీవల అద్దె ఇల్లు ఖాళీ చేయడంతో రాత్రి సమయంలో రోడ్డు పక్కనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. స్థానిక చందన బ్రదర్స్ ఎదురుగా ఆదివారం రాత్రి రోడ్డు పక్కనే తన ట్రైసైకిల్‌లో నిద్రపోయిన జగపతిరావు సోమవారం తెల్లవారు జామున చూసేసరికి మృతి చెందాడు. కోనసీమ వికలాంగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు పరశురాముడు ఆధ్వర్యంలో వికలాంగులు బొంతు శ్రీనివాస్, సాధనాల విగ్నేశ్వరరావు, సుంకర రాజు తదితరులు జగపతిరావు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కోడిపందేలు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో గుడ్డిగూడెం శివారు కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. గుడ్డిగూడెం గ్రామ శివారు పోలవరం కాలువ గట్టు దగ్గరలో కోడిపందేల స్థావరంపై దాడి చేశామన్నారు. ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.40,070 నగదు, ఐదు బైకులు, ఒక కోడి, ఒక కోడి కత్తిని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.రామకృష్ణ హెచ్చరించారు.

పేదల కడుపుగొడుతున్న సర్కారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పేదల కడుపుగొడుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 14వ డివిజన్‌లో స్థానిక టిడిపి నాయకులతో కలిసి 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పత్రాలను అందచేసి ప్రజల అభిప్రాయాలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేదల రేషనకార్డులు తొలగింపు, పింఛన్లు తొలగించడం లాంటి కార్యక్రమాలతో వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. పాలకుల అసమర్థత, స్థానిక నాయకుల స్వార్థం రెండు కలగలసి సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనాన్ని దుర్భరంగా మార్చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెరగడం వల్ల సామాన్యుడి బతుకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది.

కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన కోలా రాంబాబు కుమారుడు కోలా శ్రీనివాస్ అను నేను ఇండియన్ పాస్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ నుండి U6950964 నెంబరుతో పాస్‌పోర్ట్ పొందియున్నాను. ది.21-12-2022వ తేదీన సదరు ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను జిరాక్స్ తీయించుకొనుటకు వాడపల్లిలో నా యింటి వద్ద నుండి మోటారు బైక్‌పై కొవ్వూరు వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. పాస్‌పోర్ట్ దొరికినవారు ఈ క్రింది చిరునామాకు సమాచారం ఇప్పించగలరు.

కోలా శ్రీనివాస్,
s/o రాబాంబాబు
డోర్ నెం: 2-68, రైస్ మిల్లు వీధి,
వాడపల్లి, కొవ్వూరు మండలం.
సెల్: 7396429304

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. వివరాలు ఇవి..

కాకినాడ కార్పొరేషన్ కాకినాడ జిల్లా ఎస్.పి. ఎం. రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు, కాకినాడ జిల్లా స్పెషల్ బ్రాంచ్ టీం, కాకినాడ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ హెూటల్ రూమ్‌లో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసు కున్నారు. వారి నుంచి రూ.1,43,140- నగదును స్వాధీన పరచు కాకినాడ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు.

గండేపల్లి గండేపల్లి మండలం జెడ్ రాగంపేట గ్రామ శివర్లో సోమవాం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ గణేష్ కుమార్ సిబ్బందితో దాడి చేసి ఆరుగురు వ్యక్తులును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 7500 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.

నల్లజర్ల నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. నల్లజర్ల పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని 10 ద్విచక్ర వాహనాలను రూ.56 వేల నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ లక్ష్మణ్ రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నల్లజర్ల మండలం అనంత పల్లి గ్రామంలోగల ఎర్ర కాలువ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్ ను సీజ్ చేసినట్లు సిఐ లక్ష్మణ్ రెడ్డి తెలిపారు.

చోరీకి గురైన షాపును పరిశీలిస్తున్న డిఎస్‌పి

మద్యం షాపుల్లో చోరీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని రెండు మద్యం షాపులు చోరీ చేసి ఇద్దరినీ గాయపరిచిన ఘటన సోమవారం వేకువ జాము జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలివి..

వాచ్‌మెన్లకు గాయాలు

చెముడులంక పరిధి ఏటుగట్టు పక్కన ఉన్న మద్యం షాపుపై సోమవారం వేకువ జామున దుండగులు చోరీ యత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడ నిద్రిస్తున్న వాచ్‌మెన్లు నాగిరెడ్డి గణేష్, నాగిరెడ్డి నాగవర ప్రసాద్‌పై రాడ్లు, బ్లేడ్లు, చాకులతో దాడికి తెగబడ్డారు. నిద్రావస్థలో ఉన్న వారికి గాయాలయ్యాయి. వారిద్దరూ అరవడంతో దుండగులు పారిపోయారు. క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

నగదు, మద్యం సీసాల చోరీ

ఆలమూరులో స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మద్యం షాపులోనూ సుమారు రెండు గంటల ప్రాంతంలో దొంగలు పడ్డారు. అయితే ఇక్కడ వాచ్మెన్‌ను బెదిరించి గదిలో బంధించి, ఈ షాపు కౌంటర్లో ఉన్న రూ.1,63,700 నగదును, రూ.8,900 విలువైన మద్యం సీసాలను తాళాలు బద్దలు కొట్టి దుండగులు అపహరించారు. మండలంలో జరిగిన రెండు ఘటనలపై క్లూస్ టీమ్ ను రప్పించి, వివరాలు సేకరించి పోలీసులు దర్యాప్తు చేపటారు. విషయం తెలుసుకున్న కొత్తపేట డిఎస్‌పి ెంకటరమణ ఘటన స్థలాలను పరిశీలించారు. చోరీలకు కారకులైన నిందితులను పట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట రాజమహేంద్ర వరం డిపో ఎస్ఐ ఎస్‌కె.సుభాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF HONOURABLE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT: RAJAMAHENDRAVARAM
O.S.No.312/2022

Between:
State Bank of India,
RASMECCC & SARC Wing,
Danavaipeta, Rajamahendravaram,
Rep.by.its Manager. ...Plaintiff
Vs
1.Sheetal Jain
2.Ashok Kumar Jain ...Defendants

SUMMONS

To.
1.Sheetal Jain, W/o.Ashok Kumar Jain, D.No.32-7-21, Rachhabanda Veedhi, Near vulli Market, Rajahmundry.
2.Ashok kumar Jain, S/o.Paramal Jain, D.No.32-7-21, Rachhabanda Veedhi, Near Vulli Market, Rajahmundry.

Please take notice that the above plaintiff filed the suit against you for recovery of an amount Rs.1,10,618/- togethe with subsequent interest and other reliefs. The above suit stand posted to 02.01.2023 for your appearance either in person or through a pleader on the above mentioned date in the said court at 10.30 A.M to answer the claim, failing which the matter will be disposed off as per law.

KANDUKURI SRINIVAS
Advocate,
Rajamahendravaram.
Cell: 9059549017